వర్షాలతో 14 ఎంయూలు తగ్గిన విద్యుత్ డిమాండ్!

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో గ్రేటర్‌లో రోజు వారీ విద్యుత్ డిమాండ్ 14 మిలియన్ యూనిట్లు తగ్గింది. జూన్ 1వ తేదీన గ్రేటర్‌జోన్‌లో 86 మిలియన్ యూనిట్లుగా నమోదైన విద్యుత్ డిమాండ్ 7 నాటికి 72 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. వర్షాల కారణంగా నాలుగురోజులుగా రోజువారీ విద్యుత్ వినియోగం 72-73 మిలియన్ యూనిట్లుగా మాత్రమే నమోదవుతుంది. గ్రేటర్‌లో గత శనివారం(జూన్1న) 4,046 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవగా, శుక్రవారం(జూన్7) నాటికి 3,412 మెగావాట్ల డిమాండ్ నమోదైంది.

ప్రత్యేక చర్యలు..

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా విద్యుత్‌శాఖ ప్రత్యేకచర్యలు తీసుకుంటోంది. సెక్షన్, డివిజన్లలో అదనపు సిబ్బంది నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు 24 గంటలు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సిబ్బందితో పాటు ఆపరేషన్ వింగ్ ఏఈ, ఏడీఈ, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. విద్యుత్ లైన్లపై చెట్లకొమ్మలు తొలగించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్‌తీగలు వేస్తున్నారు. విద్యుత్‌మరమ్మతులు చేపట్టే సిబ్బంది తప్పనిసరిగా భద్రత సూత్రాలు పాటించాలని, అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహించాలని ఇప్పటికే టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించారు.

సికింద్రాబాద్ నుంచి 19వ భారత్ గౌరవ్ రైలు

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాల యాత్రకు సికింద్రాబాద్ నుంచి ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన 19వ భారత్ గౌరవ్ రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శనివారం ప్రారంభమైంది. దీనిని ప్రయాణికుల్లో సీనియర్లు దినేష్ చుట్కే(75), సతీమణి సాధనా చుట్కే(63) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జెండా ఊపడంతో భారత్‌గౌరవ్ రైలు ప్రయాణం ప్రారంభమైంది. అయోధ్య-కాశీ వెళ్లే ప్రయాణికుల నుంచి ఈ రైలు ఎంతో ఆదరణ పొందిందని, వంద శాతం పూర్తి ఆక్యుపెన్సీతో బయలుదేరిందని ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ పి.రాజ్‌కుమార్ తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక, పర్యాటక అభివృద్ధికి భారత్ గౌరవ్ రైళ్లు పెద్ద పీట వేస్తున్నాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

కేంద్రమంత్రివర్గంలోకి 50 శాతం బీసీలను తీసుకోవాలి

బర్కత్‌పుర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఏర్పాటు కానున్న కేంద్రమంత్రివర్గంలో 50 శాతం పదవులు బీసీలకే ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ముగ్గురు బీసీ ఎంపీలను కేంద్రమంత్రివర్గంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం సంయుక్త ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రెండు లక్షల కోట్ల రూపాయలను కేటాయించాలని, స్థానికసంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, సి.రాజేందర్, జి.అనంతయ్య, నందగోపాల్, వేముల రామకృష్ణ, ఉదయ్ నేత, జిల్లపల్లి అంజి, మట్ట జయంతిగౌడ్, హరితిలక్‌సింగ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపుతో స్వీట్లు పంపిణీ

నల్లకుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయం సాధించడంతో టీపీసీసీ నేతలు శనివారం నల్లకుంటలోని పార్టీ కార్యాలయం సమీపంలో సంబురాలు చేసుకున్నారు. ప్రజలు, కార్యకర్తలకు స్వీట్లు తినిపించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జీబీ.శ్యామ్‌రావు, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, నాయకులు సీహెచ్.మురళీకృష్ణ, శరత్‌బాబు, ఎడ్ల నరేందర్‌రెడ్డి, పి.రామ్మోహన్‌రావు, దేవిరెడ్డి విజితారెడ్డి పాల్గొన్నారు.

అరుంధతీనగర్‌లో వరదనీరు నిలవకుండా చర్యలు : ముఠా జైసింహ

చిక్కడపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతీనగర్ బస్తీలో వరదనీరు నిలవకుండా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నిచర్యలూ తీసుకుంటున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్రనేత ముఠాజైసింహ తెలిపారు. అరుంధతినగర్ బస్తీలో ఆయన పార్టీ అధ్యక్షుడు ముదారపు రాకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యటించి, వరదనీటి సమస్యను పరిశీలించారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, శ్రీకాంత్, జీవై.గిరి, గౌస్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే కిషన్‌రెడ్డి విజయం

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బూత్‌స్థాయి కార్యకర్తల సమష్టి కృషి వల్లనే జి.కిషన్‌రెడ్డి రెండోసారి విజయం సాధించారని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని భరత్‌నగర్‌లో పార్లమెంట్ ఎన్నికల తీరు, పోలైన ఓట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాస్కర్, రాము, బాలు, సుధాకర్, మహేష్‌కుమార్, నర్సింగ్, ప్రవీణ్‌కుమార్, వినోద్‌కుమార్, సాయిచరణ్, అనిల్, సాయికుమార్, భార్గవ్, పరమేష్, ఉదయ్ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో స్నేహితుడిపై దాడి

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మత్తులో ఓ యువకుడు తన స్నేహితుడిపైనే దాడి చేశాడు. ఈ దాడి ఆ యువకుడు తీవ్ర గాయాలకు గురై గాంధీ ఆస్పత్రిలో చేరి చావుబతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ముషీరాబాద్ పీఎస్ పరిధిలో జరిగింది. భోలక్‌పూర్‌లోని రంగానగర్‌లో నివాసం ఉంటున్న తరుణ్ (22) వృత్తిరీత్యా లేబర్. భోలక్‌పూర్‌కు చెందిన సాల్మన్ (22) యువకుడు తరుణ్‌కు స్నేహితుడు. ఈనెల 5 తెల్లవారుజామున సాల్మన్ గంజాయి తాగిన మత్తులో తరుణ్‌పై తీవ్రంగా దాడిచేశాడు. దీంతో తరుణ్‌కు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదు మేరకు తరుణ్‌ను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు బాధ్యుడైపై చర్యలు తీసుకోవాలని బాధితుడి తరఫువారు ముషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నిరంజన్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని ఎలాంటి ప్రాణాపాయం లేదని గాంధీ ఆస్పత్రి వైద్యులు తెలిపినట్లు ముషీరాబాద్ పోలీసులు తెలిపారు.

నాలాలో గుర్తుతెలియని మృతదేహం



నాలా నీటలో తేలిన మృతదేహం

కవాడిగూడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ బ్రిడ్జినాలాలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు దోమలగూడ పోలీసులు శనివారం తెలిపారు. ఎస్ఐ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అశోక్‌నగర్ బ్రిడ్జి నాలాలో ఓ గుర్తు తెలియని మృతదేహం మురుగు నీటిపై తేలుతున్నట్లు డయల్ 100కు ఫిర్యాదు అందడంతో దోమలగూడ పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. చుట్టుపక్కల వారిని విచారించగా ఎలాంటి సమాచారం తెలియలేదు. దీంతో పై అధికారుల ఆదేశాల మేరకు మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటాయని, ఎరుపు రంగు చెక్స్ చొక్కా, ఖాకీ ప్యాంటు, గోధుమ రంగు బెల్టు, నల్ల గడ్డం, మీసాలు, వెనుక వైపు భుజంపై ఒక పుట్టు మచ్చ, ఎత్తు సుమారు 5.5 అడుగులు ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

- షటిల్ ఆడడానికి క్రీడాకారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



జీహెచ్ఎంసీ షటిల్ ఇండోర్ స్టేడియం



సగానికి పైగా వెలుగని లైట్లు

స్పోర్ట్స్ సమస్యల కాంప్లెక్స్



షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపం వల్ల కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన పార్సిగుట్ట ఈస్ట్ మున్సిపల్ కాలనీలోని జీహెచ్ఎంసీ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో షటిల్ క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన నాలుగు షటిల్ కోర్టుల నిర్వహణను జీహెచ్ఎంసీ గాలికి వదిలేసింది. దీంతో కోర్టు ఫ్లోరింగ్ చెక్కలు కూలిపోయి క్రీడాకారులు కిందపడి గాయాలకు గురవుతున్నారు. షటిల్ కోర్టులో లైట్లు సగానికిపైగా వెలుగడం లేదు. లైటింగ్ లేకపోవడం వల్ల షటిల్ కాక్ క్రీడాకారులకు కనబడడం లేదు. ఒక్కోసారి క్రీడాకారులు షటిల్ కాక్‌లను కొట్టబోయి ఒకరినొకరు బ్యాట్‌లను కొట్టుకుంటున్నారు. దీంతో దాదాపు రూ.4వేల నుంచి రూ.5 వేల విలువ చేసే బ్యాట్ (రాకెట్)లు విరిగిపోతున్నాయి. కోర్టుకు గమ్మింగ్ చేయకపోవడం వల్ల గ్రౌండ్ చెక్కలు అరిగి క్రీడాకారులు జారి కిందపడిపోతున్నారు. మంచినీటి సౌకర్యం కూడా లేదు. బాత్రూమ్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల దుర్గంధభరితంగా మారాయి. రెండో అంతస్తులో జిమ్, క్యారమ్ ఇతర క్రీడాసామగ్రి ఏర్పాటు చేయకపోవడం వల్ల వాటి కోసం ఏర్పాటు చేసిన గదులు నిరుపయోగంగా ఉన్నాయి. స్టేడియం పైకప్పు లీకేజీ జరిగి, వర్షం పడినప్పుడు ఉరుస్తోంది. దీంతో కోర్టులో ఉడెన్ చెక్కలు తడిసి పాడవుతున్నాయి. కోర్టులో ఏర్పాటు చేసిన పలు కిటికీల తలుపులు మరమ్మతుకు వచ్చాయి. ప్రతినెలా క్రీడాకారులు రూ.500 జీహెచ్ఎంసీకి చెల్లిస్తున్నా అధికారులు మౌలిక వసతులు కల్పించడం లేదని పలువురు క్రీడాకారులు వాపోతున్నారు. వెంటనే ఈ సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యను వెంటనే పరిష్కరించాలి

జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో మౌలిక వసతులు లేక క్రీడాకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. లైటింగ్ పోయి చీకటిగా ఉంటుంది. దీంతో షటిల్ కాక్ కనబడక సరిగ్గా ఆడలేకపోతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కొత్త లైట్లు ఏర్పాటు చేయాలి. నిర్వహణపై కూడా చర్యలు తీసుకోవాలి. బాత్రూమ్ శుభ్రం చేయాలి. వర్షా కాలంలో వర్షం నీరు గ్రౌండ్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.



- నాగరాజు, క్రీడాకారుడు

రామోజీరావుకు ఘననివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, నాయకులు - బర్కత్‌పుర

నల్లకుంట/రాంనగర్/ ముషీరాబాద్/చిక్కడపల్లి/బర్కత్‌పుర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటు అని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జీబీ.శ్యామ్‌రావు అన్నారు. సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్ సంతాపం ప్రకటించారు. బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, నాయకులు, పలువురు జర్నలిస్టులు నివాళులర్పించారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలల చాటిన వ్యక్తులలో రామోజీరావు ఒకరని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, ప్రధాన కార్యదర్శులు పి. బాల్‌రాజ్‌గౌడ్, నల్లెల కిషోర్‌లు కొనియాడారు. విప్లవాత్మక మార్పులకు బీజం వేసిన మహనీయుడు రామోజీరావు అని తెలుగు యువత తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కె. కిరణ్‌కుమార్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో రామోజీరావుకు గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, ప్రముఖగాయకుడు త్రినాథరావు తదితరులు నివాళలర్పించారు. రామోజీరావు మృతికి రాష్ట్ర చిన్న, మధ్య దినపత్రికల అసోసియేషన్ సంతాపం ప్రకటించింది. అసోసియేషన్ చైర్మన్ కె.రంగశాయి, అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి టి.కృష్ణ, ఉపాధ్యక్షులువై.సురేష్‌బాబు కోశాధికారి కె.సుబ్బారావు నివాళులర్పించారు.

27వేల మంది కార్మికులకు బాండ్ల బకాయిలు చెల్లించాలి

- ఆర్టీసీ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 2013 పీఆర్సీ బాండ్ల బకాయిలు 27వేల మంది కండక్టర్‌లు, గ్యారేజీ సిబ్బందికి తక్షణం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పదేళ్ల క్రితం కార్మికులు బాండ్స్ రూపంలో దాచుకున్న డబ్బులను చెల్లించకుండా జాప్యం చేయడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. కార్మికుల బాండ్స్ బకాయిల చెల్లింపుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవరి 10న ఆర్టీసీ ఎండీకి రూ.280 కోట్ల చెక్కును అందించినప్పటికీ నాలుగు నెలలుగా పెండింగ్‌లో పెట్టారని ఆయన విమర్శించారు. స్కూళ్లు, కాలేజీలు ప్రారంభమైనందున కార్మికుల కుటుంబాల పిల్లల విద్యా అవసరాలను పరిగణలోకి తీసుకుని బాండ్స్ బకాయిలను తక్షణం చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి 13 వరకు పీజీఈసెట్ పరీక్షలు

ఒక్క నిమిషం లేటైనా అనుమతి ఉండదు

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీజీఈసెట్) పరీక్షలు ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు జరగనున్నాయి. ఈ సెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షాకేంద్రాలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన లోనికి అనుమతించే ప్రసక్తేలేదని సెట్ కన్వీనర్ డాక్టర్ ఎ.అరుణకుమారి తెలిపారు. పీజీఈసెట్ పరీక్షలు ప్రతిరోజూ సెషన్1లో ఉదయం 10గంటలకు, సెషన్2లో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమవుతాయని, పరీక్ష సమయం కంటే గంటన్నర ముందుగానే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పీజీఈసెట్‌కు 22,712 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో హైదరాబాద్ జోన్ నుంచి 18,300 మంది, వరంగల్ జోన్ నుంచి 4,412మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తెలంగాణేతర అభ్యర్థులు 1,145మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 556 మంది ఆంధ్ర, 257మంది రాయలసీమకు చెందిన వారుండగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 332మంది ఉన్నట్లు కన్వీనర్ తెలిపారు. గత మూడేళ్లుగా పీజీఈసెట్‌కు అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2022లో 14,921మంది, 2023లో 16,563 మంది, 2024లో 22,712మంది దరఖాస్తు చేసుకున్నారు.

టీజీఎస్పీడీసీఎల్‌లో పేరుకుపోతున్న ఫైళ్లు

- ప్రతి పనికి సీఎండీని కలవాలంటున్న ఇన్‌చార్జి డైరెక్టర్లు
- కొత్త డైరెక్టర్ల ఎంపికపై ఉత్కంఠ

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో ఇన్‌చార్జి డైరెక్టర్ల తీరుతో ఫైళ్లు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. గత కొన్నిరోజులుగా ఇన్‌చార్జి డైరెక్టర్లు ఆయా విభాగాల్లో ఫైళ్లను పరిశీలించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏ పనికావాలన్నా డిస్కం సీఎండీని కలవాలని డైరెక్టర్లు చెబుతున్నారని కొంతమంది కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. డిస్కం పరిధిలో గత ప్రభుత్వ హాయంలో సుమారు 80కి పైగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పనులు నిలిచిపోవడానికి స్థల వివాదం కారణం కాగా, అధికారులు అన్నింటికీ ఒకటే కారణం చూపి పనులు నిలిపివేశారని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్త టెండర్లు పిలవడం లేదని, మెయింటెన్స్ పనులకు నిధులు కేటాయించడం లేదని, గ్రేటర్‌లో వందల ప్రాంతాల్లో 11 కేవీ ఫీడర్లు ఓవర్ లోడ్ కారణంగా సరఫరాలో అంతరాయాలు తలెత్తుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డైరెక్టర్ల పోస్టులకు పలువురు ప్రయత్నాలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత డిస్కంలో పదేళ్లుగా డైరెక్టర్లుగా కొనసాగిన వారిని తొలగించడంతో పాటు కొత్త డైరెక్టర్ల నియామానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల కోడ్‌తో డైరెక్టర్ల నియామకం ఆలస్యం కావడంతో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారినే ఇన్‌చార్జి డైరెక్టర్లుగా సీఎండీలు నియమించారు.

ఎన్నికల కోడ్ ముగియడంతో కొత్త డైరెక్టర్ల నియామకాలపై ఉత్కంఠ నెలకొంది. టీజీఎస్పీడీసీఎల్‌లో డైరెక్టర్ల పోస్టులకు ఇప్పటికే కొంతమంది ఆశావాహులు కాంగ్రెస్ పెద్దలను కలుస్తూ ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. డైరెక్టర్ల నియామకాలకు ఓ ప్రత్యేక కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిస్కంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్గి, సీనియర్ ఇంజనీర్లను డైరెక్టర్లుగా నియమించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఐఏఎస్‌లు సీఎండీలుగా ఉంటూ అవినీతి ఆరోపణలు లేని సీనియర్ ఇంజనీర్లను డైరెక్టర్లుగా నియమిస్తే విద్యుత్ సంస్థల్లో మార్పులు తీసుకువచ్చే అవకాశముంటుందని సీనియర్ రిటైర్డ్ ఇంజనీర్లు సూచిస్తున్నారు.

వర్షానికి జలమయమైన రోడ్లు



భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం పడడంతో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌నియోజకవర్గంలో శనివారం సాయంత్రం కురిసిన భారీవర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయంగా మారాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి విద్యానగర్‌కు వెళ్లే మెయిన్ రోడ్డులో పాత బస్‌భవన్, వీఎస్టీ చౌరస్తాలో వర్షం నీరు మోకాలిలోతు పైగా నిలిచిపోయింది. వీఎస్టీ నుంచి రాంనగర్ వెళ్లే మార్గంలో కూడా రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయింది. రోడ్డుపై నిలిచిన నీటిని జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్ కొంతవరకు తొలగించారు.





వర్షానికి వీఎస్టీ మార్గంలో జలమయమైన రోడ్లు

రివార్డు, గిఫ్ట్ కూపన్‌ల పేరుతో సైబర్ వల

- ఏపీకే ఫైల్, సందేశం పంపి నగదు దోపిడీ

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి చైతన్యకు స్టేట్ బ్యాంక్ పేరుతో వాట్సా్ప్‌లో ఓ సందేశం వచ్చింది. మీ బ్యాంక్ ఖాతాకు ఎస్‌బీఐ రివార్డు రూ.7,250 యాక్టివేట్ అయిందని, ఈ రోజుతో దాని కాలపరిమితి ముగుస్తుందని మెసేజ్ వచ్చింది. రివార్డు కావాలంటే కింద పంపిన లింక్ ద్వారా ఎస్‌బీ రివార్డు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, క్లెయిమ్ చేసుకుంటే మీ ఖాతాలో డబ్బు జమ అవుతాయని సందేశంలో ఉంది. తన నెంబర్‌తో పాటు, స్నేహితులు, సహోద్యోగులు ఉన్న వాట్సాప్ గ్రూపులో కూడా ఇదే మెసేజ్ రావడంతో కొంతమేరకు నమ్మకం వచ్చింది. స్నేహితుడు కూడా ఇదే మెసేజ్ పంపడం, మెసేజ్ వచ్చిన నెంబర్ డీపీలో బ్యాంక్ లోగో ఉండడం, చాలాకాలంగా ఎస్‌బీఐ ఖాతా ఉండడంతో రివార్డు నిజమని భావించిన చైతన్య ఏపీకే లింక్‌ను ఓపెన్ చేశాడు. ఎస్‌బీఐని పోలిన వెబ్‌సైట్(ఎస్‌బీఐ రివార్డ్స్) ఓపెన్ కావడంతో, ఖాతా వివరాలు, కార్డు, సీవీవీ వివరాలు నమోదు చేశాడు. కొంతసేపటికి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు విత్‌డ్రా అయినట్లు సందేశాలు రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమాచారం చోరీ..

ఓటీపీ, ఓఎల్ఎక్స్ మోసాలపై అవగాహన పెరడగంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ముందుకు వెళ్తున్నారు. ప్రముఖ బ్యాంక్‌లు, సంస్థలు, ఈ కామర్స్ సైట్ల పేర్లను దీనికోసం వాడుతున్నారు. సిమ్‌లను సేకరించి, వాటికి ప్రముఖ సంస్థలు, బ్యాంక్‌ల లోగోలు, పేర్లు తగిలిస్తున్నారు. పలువురికి రివార్డు, ఆఫర్ కూపన్‌ల పేరుతో లింక్‌లను పంపుతున్నారు. లింక్ ఓపెన్ చేస్తే, దాని ద్వారా ఫోన్‌ను హ్యాక్ చేయడంతోపాటు సమాచారాన్ని కూడా తస్కరిస్తున్నారు. సందేశాలు ఎక్కువ మందికి వెళ్లేలా పలు వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. ఇది నిజమా? కాదా? అని కూడా నిర్ధారించకుండా కొంతమంది తమ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ఇదే సందేశాన్ని ఫార్వర్డ్ చేస్తున్నారు. పంపింది స్నేహితుడే కదా అని, ఓపెన్ చేసిన వారు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు. ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని సేకరించిన సైబర్ నేరగాళ్లు, ఖాతా వివరాలు సేకరించి డబ్బు కాజేయడంతోపాటు, సమాచారం, వీడియోలు, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి సందేశాలను వెంటనే డిలీట్ చేయాలని సైబర్ క్రైం అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు.

ఘనంగా శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని ప్రేమ్‌నగర్‌లో గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకపూజా కార్యక్రమంలో బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఎడ్ల అనిల్, ఎడ్ల రాకేష్, ఎడ్ల సంతోష్, తిరుపతి గుప్తా, శ్రీకాంత్‌లు ఆలయంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు.

పోచమ్మ గర్భగుడికి 20 కేజీల వెండి తొడుగు



శ్రీపోచమ్మ గర్భగుడికి వెండితొడుగును సమర్పిస్తున్న ఎన్ఆర్ఐ ఆనంద్ దేశి రాజేందర్

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని జెమినీ కాలనీలో పేరొందిన శ్రీపోచమ్మ ఆలయం గర్భగుడికి స్థానిక నివాసి అయిన ఎన్ఆర్ఐ ఆనంద్ దేశి రాజేందర్ గర్భగుడికి 20 కేజీల వెండి తొడుగును శనివారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ పునర్‌నిర్మాణ పనుల పర్యవేక్షణ

చిక్కడపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్ బస్తీలో శ్రీ నల్లపోచమ్మ దేవాలయం పునర్‌నిర్మాణ పనులను కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ శనివారం పర్యవేక్షించారు. ఇటీవల దేవాలయం అభివృద్ధిలో భాగంగా కార్పొరేటర్ పావనివినయ్ ఫ్లోరింగ్ నిర్మాణంకోసం గ్రానైట్‌ను సమకూర్చిన అనంతరం మిగిలి ఉన్న పనులను ఆలయ కమిటి సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బోనాల పండుగలోగా పనులు పూర్తయ్యేలా ఆలయ కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, కుమార్, రహమత్‌అలీ, ఆనంద్‌రావు, డేవిడ్, ప్రశాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎరుకల సామాజికవర్గం అభ్యున్నతి కోసం ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని నియమించాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎరుకల సమస్యలను పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా ఏకలవ్య భవన నిర్మాణం పూర్తి చేసినా ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. ఆదివాసి ఎరుకల విద్యార్థినీవిద్యార్థులు చదువుకునేందుకు వీలుగా వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అదనపు అంతస్తుకు నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు వనం రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైదిక బ్రాహ్మణులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

నల్లకుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో వైదికబ్రాహ్మణులకు తీరని అన్యాయం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా సరైన న్యాయం చేయాలని తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నేతలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురుకుంట్ల రాజేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శి పుప్పల బాలసుబ్రహ్మణ్యంలు మాట్లాడారు. తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అప్పుడే బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు అర్పిత, రాష్ట్ర నాయకులు కాశీనాథశర్మ, చిన్మయశర్మ, నారాయణం చక్రవర్తిశర్మ, పాపయ్యశర్మ, అనిల్‌కుమార్, వెంకటరమణాశర్మ, ప్రకాశశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏబీసీడీఓ ఆధ్వర్యంలో మెగా వివాహ పరిచయవేదిక

చిక్కడపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ(ఏబీసీడీఓ) చిక్కడపల్లి ఆధ్వర్యంలో శీఘ్రవివాహాల కోసం కన్యా, వరపాశుపత హోమాలు, 82వ బ్రాహ్మణ ఉచిత మెగా వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డా.ఎస్.ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈనెల 23న ఆదివారం న్యూనల్లకుంటలోని న్యూనల్లకుంట సహకార గృహ నిర్మాణ సంస్థ వారి కమ్యూనిటీహాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9390646539, 9100414469, 9492866204 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు.

గాయకులను ప్రోత్సహిస్తే అద్భుతాలు

చిక్కడపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గాయనీగాయకులను ప్రోత్సహించినప్పుడే వారు మంచి అద్భుతాలు సాధించగలరని ప్రముఖ ఘంటసాల గీతాల గాయకుడు బాలకామేశ్వరరావు తాతా అన్నారు. కల్పన కళానికేతన్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో సినీ సంగీత విభావరి కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా బాలకామేశ్వరరావు గాయనీగాయకులను సత్కరించి మాట్లాడుతూ ఘంటసాల గీతాలు ప్రపంచవ్యాప్తంగా నేడు ఎంతో ప్రఖ్యాతి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీసు అధికారి గడ్డం లాలయ్యచౌదరి, నిర్వాహకుడు, ప్రముఖ రంగస్థల నటుడు దొంతి జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై విచారణ జరిపించాలి

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నీట్ పరీక్ష నిర్వహణ ఫలితాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ యూజీసీ 2024 పరీక్షను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల 24 లక్షల మంది విద్యార్థులు తీవ్రఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పరీక్షల నిర్వహణలో లోపం, మాస్ కాపింగ్ జరిగిందని దీంతో 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు రావడం వారిలో 8 మంది ఒకే సెంటర్ వారు కావడం పట్ల అనుమానం వ్యక్తం చేశారు.